క్లుప్తంగా

'పోసిన' కుటుంబానికి పరామర్శ

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు శ్రీకృష్ణదేవరాయలు సోదరుడు పోసిన సత్యనారాయణ (అన్నవరం) ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు బుధవారం అన్నదేవరపేట వెళ్లి పోసిన కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మృతికి తీవ్ర సంతాపాన్ని తెలిపారు. పరామర్శించిన వైఎస్సార్ సీపీ తాళ్లపూడి మండల నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, తోట రామకృష్ణ, కొమ్మిరెడ్డి పరశు రామారావు, తిగిరిపల్లి వెంకట్రావు, పిట్టా శ్రీనివాస్, వల్లభొట్టి చిన్ని తదితరులు ఉన్నారు.

ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసీల హత్యలు

నిడదవోలు: ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో 31 మంది ఆదివాసీలను భద్రతా దళాలు హత్య చేయడాన్ని పీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్ ఖండించారు. ఆదివాసీ హక్కుల సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య (పీకేఎస్), సీపీఎం, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ), కులనిర్మూలన పోరాట సమితి, ఎమ్మార్పీస్ నాయకులు మాట్లాడారు. అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో పది నెలలుగా ఆదివాసీలపై హత్యాకాండ తీవ్రమైందన్నారు. ఎన్‌కౌంటర్ల పేరుతో జరుగుతున్న ఆదివాసీ హత్యలన్నింటిపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కోరారు. సీపీఎం నాయకులు జువ్వ ల రాంబాబు, న్యూ డెమోక్రసీ నాయకుడు ఈమని గ్రీష్మ కుమార్, ఎమ్మార్పీస్ నాయకుడు చెట్టి రామకృష్ణ, గెడ్డం రవీంద్రబాబు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో మంత్రి సోదాలు

నల్లజర్ల: స్థానిక వెంకటసత్య రైస్ మిల్లును రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీ చేశారు. కొవ్వూరు మండలం కాపవరంలో బుధవారం సాయంత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి మనోహర్ అక్కడి నుంచి విజయవాడ వెళ్తూ మార్గమధ్యలో ఈ మిల్లును తనిఖీ చేశారు. మిల్లు, గోడౌన్ మూసి ఉండటంతో తన సెల్‌ఫోన్ లైటింగ్‌లో మొత్తం ఆ ప్రాంతాన్ని మంత్రి కలియ దిరిగారు. మూసి ఉంచిన గోడౌన్‌లోని బస్తాల్లో 50 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. వీటన్నింటిని లెక్కించి ఎంత మొత్తంలో రేషన్ బియ్యం ఉన్నదీ లెక్కలు తేల్చాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

దేవరపల్లి: రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం రాత్రి 9- 10 గంటల మధ్య దేవరపల్లిలోని రెండు రైస్ మిల్లులను తనిఖీ చేశారు. ఒక రెండు నెలల క్రితం అధికారులు స్వాధీనం చేసుకుని 360 కిలోల బియ్యాన్ని ఈ మిల్లుకు అప్పగించారు. బుధవారం నాటి తనిఖీల్లో మిల్లులో సీజ్ చేసిన బియ్యం కనిపించలేదు.దాంత ఈ మిల్లుపై కేసు నమోదు చేయాలని మంత్రి ఆదేశించారు.

పంచాయతీ పాలనపై సభ్యులకు అవగాహన

కొవ్వూరు: గ్రామ పంచాయతీ పాలనా వ్యవహారాలపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల పాటు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, సొంత ఆదాయ వనరుల గుర్తింపు, సమకూర్చుకోవడం, తాగునీటి సరఫరా, పంచాయతీల ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, లే అవుట్లు, భవనాల నిర్మాణానికి అనుమతులు, నియమాలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందిస్తున్న సంక్షేమ పథకాలు, నిధులు, లీగల్ లీటరసీ, పంచాయతీల ఆస్తులు, వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి రీసోర్స్ పర్సన్‌లు వారికి వివరించారు.ఒక్కో పంచాయతీకి ఎంపిక చేసిన ఇద్దరు వార్డు మెంబర్లు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ అందించారు.

ఆస్తులు పరిరక్షించాలి

నిడదవోలు రూరల్: పంచాయతీల ఆస్తులను పరిరక్షించి, గ్రామాభివృద్ధికి పాలక వర్గాలు కృషి చేయాలని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలో ఎంపిక చేసిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులను బుధవారం సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కేవీ గణేశ్ కూడా పాల్గొన్నారు.

పండగ పూటా పస్తులే..

- నింగినంటిన నిత్యావసరాల ధరలు
- ఘోరంగా కూరగాయల రేట్లు
- దిక్కుతోచని సామాన్యులు
- పనులు లేక అవస్థలు పడుతున్న కూలీలు


కానూరులో కూరగాయల దుకాణం

పెరవలి: పండగ పూటా పస్తులు ఉండాల్సిన పరిస్థితి. నిత్యావసరాల ధరలు నింగిని అంటడంతో దసరా పండగ వేళ సామాన్యుడు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధరలు ఒక్కొక్కటిగా పెరిగి పోతున్నాయి. రెండు నెలల క్రితం వరకూ రూ.80 నుంచి రూ.110 ఉండే కిలో వంట నూనె నేడు రూ.120 నుంచి రూ.160కు పెరిగింది. ఇక పప్పులు, బియ్యం ధరలు కొండెక్కి కూర్చున్నాయి. వర్షాలు, వరదల వల్ల పేదలకు రోజూ పనులు దొరకడం లేదు. ఒక రోజు పనిలోకి వెళితే, వచ్చే కొద్దిపాటి ఆదాయంతో నిత్యావసరాలు కొనుగోలు చేద్దామని బజార్‌కు వెళితే నాలుగు రకాలు కూడా రావడం లేదని వాపోతున్నారు. దానికితోడు కూరగాయల ధరలు కూడా ఎన్నడూ లేనంతగా పెరిగాయి. దాంతో సామాన్యులు ఒక పూట కూరతో, మరోపూట పచ్చడితో కడుపు నింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇవీ కారణాలు

ఈ ఏడాది భారీ వర్షాలు కురిశాయి. అంతేగాకుండా కృష్ణా, గోదావరి నదులకు ఉధృతంగా వరదలొచ్చాయి. దాంతో లంక భూముల్లో పండించే కూరగాయల పంటలు దెబ్బతిని, ఉత్పత్తి తగ్గిపోయింది. మెట్ట ప్రాంతాల్లో సాగయ్యే కూరగాయల పంటలు కూడా భారీ వర్షాల వల్ల తెగుళ్ల బారిన పడి దిగుబడి బాగా పడిపోయింది. ఇవన్నీ కూరగాయల ధరలు పెరగడానికి ప్రధాన కారణం. ప్రస్తుతం దేవీ నవరాత్రులు నడుస్తున్నాయి. ప్రజలు మాంసాహారానికి జోలికి పోవడం లేదు. భవానీలు, స్వాములు, కూడా కూరగాయలనే వినియోగిస్తుండడంతో వాటి ధరలు మరింతగా పెరిగాయి. వంట నూనెల ధరలు పెరగడానికి కేంద్ర ప్రభుత్వం పన్నులు పెంచడం కారణమైతే, నిత్యావసరాల రేట్లు పెరగడానికి రాష్ట్ర ప్రభుత్వ విధానాలు కారణమని సామాన్యులు ఆరోపిస్తున్నారు.

ఇలా అన్నిరకాల సరకుల ధరలూ పెరిగాయి. పై పట్టికలోని రేట్లు హోల్‌సేల్ మార్కెట్‌లోనివి కాగా, చిల్లర వర్తకులు కిలోకు మరో రూ.10 మార్జిన్ వేసుకుని విక్రయిస్తున్నారు. అలాగే కూరగాయలు కూడా కిలోకు రూ.10 నుంచి రూ.25 వరకూ రేటు పెరిగి పోవడంతో వినియోగదారులు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుత ఆదాయ వనరులను బట్టి కుటుంబ పోషణ కష్టమవుతోందని సామాన్యులు పేర్కొంటున్నారు.

కూరగాయల ధరల్లో పెరుగుదల ఇలా..

కూరగాయ పేరు	3 నెలల క్రితం (10 కిలోలు రూపాయల్లో)	ప్రస్తుతం (10 కిలోలు రూపాయల్లో)
ఉల్లిపాయలు	300	రూ. 500 నుండి 700
వంకాయలు తెల్లవి	400	600
వంకాయలు నల్లవి	300	500
టమాటాలు	300	1000
బీరకాయలు	400	600
బెండకాయలు	300	400
క్యారెట్	300	500
బీట్‌రూట్	300	500
దొండకాయలు	200	400
మునగకాడలు	200	400
పచ్చిమిర్చి	300	400
అల్లం	600	1000
ఆనబకాయ ఒకటి సైజును బట్టి	10 నుంచి 20	30 నుంచి 50

నిత్యావసర సరకుల ధరల్లో పెరుగుదల ఇలా..

సరకు పేరు	3 నెలల క్రితం (10 కిలోలు రూ.)	ప్రస్తుతం (10 కిలోలు రూ.)
పంచదార	400	420
కందిపప్పు	1,400	1,600
మినపప్పు	900	1100
శనగపప్పు	800	1100
పెసరపప్పు	900	1100
యాలకులు కిలో	1800	2500
వెల్లుల్లి	800	3200
పామాయిల్ (లీటరు)	85	120
సన్ ఫ్లవర్(లీటరు)	110	140


ఖండవల్లిలో కిరాణా షాపు

ధరలు చూసి హడలి పోతున్నాం


కూరగాయలు కొందామంటే ధరలు చూసి హడలిపోతున్నాం. ఎన్నడూ ఇంత రేట్లు లేవు. ఉల్లిపాయలు కిలో రూ.70కు అమ్ముతున్నారు. ఇంకే కొనగలం. ఏకూరగాయ ధర చూసినా కిలో రూ.80 వరకూ అమ్ముతున్నారు.
– గుదుమూడి నాగమణి, గృహిణి, నడుపల్లి

అసలే పనులు లేవు


నిత్యావసర సరకులు ధరలు కిలోకు రూ.20 నుంచి రూ.50 వరకూ పెరిగిపోయాయి. అసలే పనులు లేక నానా ఇబ్బందులు పడుతుంటే వాటి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏం కొనలేకపోతున్నాం. ఇంకేం దసరా పండుగ.
– మెట్టే సత్యనారాయణ, వినియోగదారుడు, ఖండవల్లి

ఒక పూటే కూర


నూనె ధరలు పెరిగిపోవడంతో కూరలు వండుకునే పరిస్థితి లేకుండా పోయింది. పనులు లేకపోవడంతో ఒకపూట కూర, మరోపూట పచ్చడితో గడపవలసి వస్తోంది. అన్ని సరుకులూ కొందామంటే అప్పు చేయవలసి వస్తోంది. ధరలను ప్రభుత్వాలు అదుపు చేయలేకపోతున్నాయి.
– పి శ్రీలక్ష్మీకాంతం, గృహిణి, అన్నవరప్పాడు

ప్రభుత్వ పెన్షనర్లకు 76 ఏళ్ల వరకూ రుణాలు

- స్టేట్ బ్యాంక్ నల్లజర్ల శాఖ మేనేజర్ శ్రావ్య


రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ బ్యాంక్ మేనేజరు శ్రావ్య

నల్లజర్ల: ప్రభుత్వ పెన్షన్‌దారులు 76 ఏళ్ల వయసు వరకూ బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నల్లజర్ల శాఖ మేనేజర్ శ్రావ్య అన్నారు. మండల రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సమావేశం అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన బుధవారం నల్లజర్లలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న బ్యాంక్ మేనేజర్ శ్రావ్య మాట్లాడుతూ ప్రత్యేక కౌంటర్ ద్వారా బ్యాంకులో పెన్షనర్ల నగదు లావాదేవీలు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఐవీ సత్యం మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు దశల వారీగా అయినా అందించాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏలూరు శాఖ ఎగ్జిక్యూటివ్ గణేశ్, ఫీల్డ్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఎస్ఎం ఆలీ సాహెబ్, ప్రభుదాస్, ఏసురత్నం, ఐడీపీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా చేయండి

తాళ్లపూడి: అంతరాయం లేకుండా శుద్ధి చేసిన గోదావరి తాగునీటిని ప్రజలకు సక్రమంగా సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ ఎన్‌వీవీ సత్యనారాయణ సిబ్బందికి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం పక్కనే గ్రామీణ తాగునీటి సరఫరా పథకాన్ని బుధవారం ఆ శాఖ అధికారులు పరిశీలించారు. పథకం నిర్వహణ, నీటి సరఫరా, మోటార్లు తదితర అంశాలను వారు పరిశీలించారు. ఇటీవల తరచూ మోటార్లు మరమ్మతులకు గురవుతున్నందున ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ ఎస్ఈ సత్యనారాయణతో పాటు, ఈఈ బీవీ గిరి, డీఈ ఎన్.అప్పారావు, మండల ఏఈ షేక్ సూర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ ప్రారంభం

- త్వరలోనే సేకరణ కేంద్రాలు ప్రారంభం
- 'పొలం పిలుస్తోంది' లో ఏవో కమల్‌రాజ్


సింగరాజుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

నల్లజర్ల: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభమైందని, త్వరలోనే మండలంలో ఈ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ ప్రకటించారు. సింగరాజుపాలెం, ప్రకాశరావుపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. ధాన్యం సేకరణకు గోనె సంచుల కొరత లేకుండా చూస్తున్నామన్నారు. ధాన్యంలో తేమను గుర్తించే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాటాలను ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. ధాన్యాన్ని కొనుగోలు చేసే సాంకేతిక సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతు వద్ద నుంచీ గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యానికి బయట మార్కెట్లో మంచి ధర వస్తే రైతులు అక్కడ కూడా విక్రయించుకోవచ్చన్నారు. ధాన్యం మిల్లుకు చేరిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ అవుతుందన్నారు. ఐదెకరాల లోపు పొలం ఉన్న రైతులు తమ పొలాలకు డ్రిప్, స్ప్రింక్లర్లు అమర్చుకోదలిస్తే ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఐదెకరాలకు పైబడి పొలం ఉన్న రైతులకు 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని కార్యక్రమంలో పాల్గొన్న కో-ఆర్డినేటర్ మారెం కనకదుర్గ రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సుబ్రహ్మణ్యం, ఉద్యాన సహాయకుడు బాల గంగాధర్, పశుసంవర్ధక శాఖ సహాయకులు ప్రభాకరరావు, రైతులు పాల్గొన్నారు.

చదువులమ్మచెట్టు నీడలో..


ఎస్ఆర్‌కే కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


వెలగదుర్రు యూపీ పాఠశాల 1991-92 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు

నల్లజర్ల: ఎక్కడో పుట్టి ..ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ..పూర్వ విద్యార్థులు సందడి చేశారు. పదమూడేళ్ల క్రితం నల్లజర్ల ఎస్ఆర్‌కే జూనియర్ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు బుధవారం ఆ కళాశాలలో సమావేశమయ్యారు. అప్పట్లో తమకు చదువులు చెప్పిన గురువులు కిరణ్‌కుమార్, శాస్త్రి, సోమయాజులు, ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌లను సత్కరించారు. మిత్రులంతా అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంతో మురిసిపోయారు. మిత్రులందరినీ ఒకే వేదికపైకి తీసుకు రావడానికి కృషి చేసిన ఆశీర్వాదం, పవన్‌కుమార్, నాగసాయి, సంధ్య, జ్యోతి, వాసులను అభినందించారు.

వెలగదుర్రు ప్రాథమికోన్నత పాఠశాల..

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు ప్రాథమికోన్నత పాఠశాల 1991-92 బ్యాచ్ ఏడో తరగతి విద్యార్థులు బుధవారం ఆ పాఠశాల్లో సమావేశమయ్యారు. అప్పటి విద్యార్థులంతా కలసి ఒకరినొకరు పేరు పెట్టి పిలుచుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. తాము చదువుకున్న రోజుల్లోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

మద్యం షాపులకు 405 దరఖాస్తులు

కొవ్వూరు: మద్యం దుకాణాల కోసం పలువురు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకుంటున్నారు. కొవ్వూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 16 దుకాణాలకు ఇప్పటి వరకూ రికార్డు స్థాయిలో 457 దరఖాస్తులు వచ్చినట్టు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి రాజమహేంద్రవరంలోని ఆనం కళా కేంద్రంలో డ్రా విధానంలో షాపులు కేటాయిస్తారని ఆయన ప్రకటించారు. అంటే ప్రస్తుతానికి అందిన దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.9.14 కోట్ల మేర ఆదాయం సమకూరినట్టే. బుధవారంతో ముగియాల్సిన దరఖాస్తుల దాఖలు గడువును మరో రెండు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ నేపథ్యంలో సుమారు రూ.10 కోట్లకు పైగా ప్రభుత్వానికి దరఖాస్తుల రూపేణా ఆదాయం సమకూరే అవకాశం ఉందని అంచనా. ఒక్కో దుకాణం దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున నాన్ రిఫండబుల్‌గా చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

నిడదవోలుకు 704 ..

నిడదవోలు: ప్రభుత్వం నిడదవోలు నియోజకవర్గానికి 19 మద్యం షాపులను కేటాయించింది. వాటి లైసెన్సుల కోసం ఇప్పటి వరకూ 704 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిడదవోలు టౌన్‌లో 153 దరఖాస్తులు చేసుకున్నారు. మండలాల వారీగా నిడదవోలు నుంచి 160, ఉండ్రాజవరం నుంచి 172, పెరవలి నుంచి 219 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుల దాఖలుకు రెండు రోజుల గడువు పొడిగించడంతో మరిన్ని దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా 125 మద్యం షాపులకు గాను ఇప్పటి వరకు 2,773 దరఖాస్తులు వచ్చాయి. దీనిలో అత్యధికంగా ఇప్పటికే నిడదవోలు నియోజకవర్గంలో 704 దరఖాస్తులు వచ్చాయి.

సిండికేట్‌గా తెలుగు తమ్ముళ్లు

పెరవలి: మద్యం షాపులను దక్కించుకునేందుకు తెలుగు తమ్ముళ్ల, జనసేన నాయకులు సిండికేట్లుగా ఏర్పడ్డారు. ఒక్కో మద్యం షాపును లాటరీలో దక్కించుకునేందుకు టెండర్ వేయాలంటే నాన్ రిఫండబుల్ కింద రూ.2 లక్షల డిపాజిట్ చెల్లించాలి. డ్రాలో మద్యం షాపు తగిలితే పర్వాలేదు. తగలకపోతే మాత్రం తీసిన డీడీ రూ.2 లక్షలు వదులుకోవాల్సిందే. ఈ డిడిల ద్వారా ప్రభుత్వాని భారీ ఆదాయం సమకూరనుంది. ఎక్కడికక్కడ తెలుగు తమ్ముళ్ళు, జనసేన నాయకులు ఒక్కటై షాపులను ఏదో విధంగా హస్తగతం చేసుకోవాలని పావులు కదుపుతున్నారు.



కె.సత్యనారాయణ (కొవ్వూరు ఎక్సైజ్ సీఐ)   ఆర్‌జే సతీష్‌బాబు (నిడదవోలు ఎక్సైజ్ సీఐ)

భవానీల ఊరేగింపు


బ్రాహ్మణగూడెంలో భవానీ మాలధారుల గ్రామోత్సవం

చాగల్లు: బ్రాహ్మణగూడెం గ్రామంలోని భవానీలు బుధవారం గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. చేతుల్లో వేప మండలను చేతబూని డప్పు వాయిద్యాలతో, నృత్యాలు చేసుకుంటూ సాగిన ఊరేగింపు గ్రామస్తులను ఆకర్షించింది.ఈ సందర్భంగా ధూపసేవ నిర్వహించారు. గ్రామంలోని అన్ని ఆలయాల్లోనూ వారు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భవానీలు, భక్తులు పాల్గొన్నారు.

నిడదవోలులో పడి పూజ

నిడదవోలు: స్థానిక రజక వీధిలోని భీమదొర తూము వద్ద గల కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి పడిపూజ నిర్వహించారు. సుమారు 300 మంది భవానీలు అమ్మవారి పడి పూజలో పాల్గొన్నారు. అమ్మవారికి పచ్చిపూల అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పడిపూజ, అమ్మవారి సెట్టింగ్ ఆకట్టుకున్నాయి.

మృతుల కుటుంబాలకు పరామర్శ


రమేష్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు

నల్లజర్ల: గత నెల 18వ తేదీన అమెరికాలో మృతి చెందిన స్థానిక ప్రకాశరావుపాలేనికి చెందిన ముత్తిన రమేష్ (40) కుటుంబ సభ్యులను మాజీ మంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించారు. మృతుని తల్లి పండమ్మ, సోదరులు నాని, నరేష్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇల్లినాయిస్ రాష్ట్రంలోని కార్‌బొనలే సిటీలోని సదరన్ ఇల్లినాయిస్ యూనివర్సిటీలో ఎంఎస్ చదవడానికి 2022లో రమేష్ వెళ్లాడని అతని మేనమామ, వైఎస్సార్ సీపీ నాయకుడు కరుటూరి లక్ష్మీ గణేశ్వరావు వివరించారు. అక్కడి యువతినే రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడని, గతనెల 17వ తేదీ రాత్రి బయటకు వెళ్లి భోజనం చేసి వచ్చి పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పినట్టు వివరించారు. రెండు రోజుల తరువాత అతని గది నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారని, వారు వచ్చి తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతి చెంది ఉన్నాడని వివరించారు. కాగా గుండెపోటు లేదా బ్రెయిన్ హేమరేజ్‌తో రమేష్ మృతిచెంది ఉండవచ్చునని భావిస్తున్నామని తెలిపారు.

పోతవరానికి చెందిన మాజీ ఎంపీపీ ఖండవల్లి కృష్ణవేణి అత్తగారు చిన వెంకాయమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను వనిత, తలారి వెంకట్రావు పరామర్శించారు. అలాగే దూబచర్లలో తొమ్మండ్రు చంద్రబోస్ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. పోతవరంలో ఇటీవల మృతి చెందిన కానూరి శేషారత్నం కుటుంబ సభ్యులను కూడా మాజీ మంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నాయకులు కారుమంచి రమేష్, పిచ్చుకుల ప్రసాద్, తొమ్మండ్రు రమేష్, తొమ్మండ్రు రవి తదితరులు ఉన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం

- సరస్వతీదేవిగా దుర్గాదేవి దర్శనం

దేవరపల్లి: చదువుల తల్లి సరస్వతీదేవి .. నమస్తుభ్యం అంటూ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని మనసారా కొలిచారు. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గామాతను సరస్వతీదేవి అవతారంలో అలంకరించి, విద్యార్థులు పూజలు చేశారు. అక్షరాభ్యాసాలు జరిగాయి. విద్యార్థులు, మహిళలతో ఆలయాలు కిటకిటలాడాయి. దేవరపల్లిలోని మూడు బొమ్మల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికాదేవి, బాలదుర్గమ్మ వారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. యర్నగూడెం, దుద్దుకూరు, పల్లంట్ల, యాదవోలు, గౌరీపట్నం, బందపురం, త్యాజంపూడి, చిన్నాయగూడెం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

చాగల్లు: బుధవారం మూలా నక్షత్రం కావడంతో అమ్మవారి ఆలయాల వద్ద చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. స్థానిక మాతంగి చెరువు గట్టున కొలువైన కనకదుర్గమ్మను సరస్వతీదేవిగా అలంకరించారు. స్థానిక మహాలక్ష్మమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. వాసవీ మాతను సుందరంగా అలంకరించారు. కలశాలతో పూజలు చేశారు. చాగల్లు గ్రామదేవత పాటమ్మ అమ్మవారి దేవాలయంలో, పాటమ్మపేటలోను, మీనానగరంలోని ముత్యాలదిబ్బవద్ద గల అమ్మవారికి భవానీలు, మహిళలు పూజలు నిర్వహించారు.

తాళ్లపూడి: స్థానిక నవ దుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మను సరస్వతీదేవిగా అలంకరించారు. సరస్వతీ దేవి వద్ద విద్యార్థులు పెన్నులు, పుస్తకాలు ఉంచి సామూహిక పూజలు చేశారు. వేగేశ్వరపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోనూ విద్యార్థులు, మహిళలు సామూహిక సరస్వతీదేవి పూజలు నిర్వహించారు.

గోపాలపురం: ఇక్కడి నుంచి దేవరపల్లి వెళ్లే రోడ్డులోని లలితాంబిక అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు, లలితా సహస్ర నామావళి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉండ్రాజవరం: పాలంగిలో దుర్గమ్మ ఆలయం వద్ద, సూర్యారావుపాలెం పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద, తాడిపర్రులోను సరస్వతీ దేవి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. చిన్నారులు సరస్వతీ పూజలు చేశారు. చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం పెరవలి, ముక్కామల, వెంకట్రాయపురం, కానూరు గ్రామాల దుర్గామాత ఆలయాలు, మంటపాల వద్ద తెల్లవారుజాము నుంచి సరస్వతీ పూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. ఖండవల్లి కనకదుర్గమ్మ ఆలయం వద్ద వందలాది భక్తులు ఒక్కసారే కూర్చుని సరస్వతీ పూజ చేశారు.


దేవరపల్లిలో బాలదుర్గమ్మ వారి ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థులు


తాళ్లపూడిలో సరస్వతీ దేవి అలంకరణలో కనకదుర్గమ్మ వారు

జగజ్జననీ.. దివ్య స్వరూపిణీ

- కోటసత్తెమ్మ సన్నిధిలో సరస్వతీ పూజలు
- 800 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

నిడదవోలు రూరల్: శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాలు, మంటపాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారి ఆలయ ప్రాంగణం ఏడో రోజైన బుధవారం భక్తులతో కళకళలాడింది. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి 507 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలు, చండీ పారాయణ, హోమాలు నిర్వహించారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక సరస్వతీ పూజల్లో పాల్గొన్న సుమారు 800 మంది విద్యార్థులకు దాతల సహకారంతో పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కోటసత్తెమ్మ అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,43,685 విరాళాలు వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ చెప్పారు. కార్యక్రమాల్లో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కోటసత్తెమ్మ వారు